www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
అన్నమయ్య

వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉప కులపతిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. నెల్లూరు విక్రం సింహపురి విశ్వవిద్యాలయం విసిగా పనిచేస్తున్న ఆయనను వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆర్డర్ ద్వారా ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ వైవీయూ విసిగా పనిచేసిన ఆచార్య ఫణతి ప్రకాష్ బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ విసిగా నియమితులయ్యారు. ఆయనను ఇక్కడి నుంచి రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో నూతన ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య శ్రీనివాసరావు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- 21,766 మంది విద్యార్థులు హాజరు
- మొదటి రోజు 530 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 22,296 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 21,766 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 530 మంది గైర్హాజరయ్యారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 21,923 మంది విద్యార్థులకు గాను 21,690 మంది పరీక్షకు హాజరు 253 మంది గైర్హాజరయ్యారు. అలాగే 373 మంది ప్రయివేట్ విద్యార్థులకు గాను 76 మంది పరీక్షకు హాజరు కాగా 297 మంది గైర్హాజరయ్యారు .అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 505 ప్రభుత్వ, ప్రయిటు పాఠశాలలతో పాటు ఎయిడెడ్ 5, ఎపిఎంఎస్ 17, ఎపిఆర్ఎస్ 8, ఎఎస్‌హెచ్‌ఆర్ఎం 1, బిసి వెల్ఫేర్ 4, కెజిబివి 22, ఎంపిఎల్ 7, ప్రయివేట్ 198, సోషయల్ వెల్ఫేర్ 11, ట్రైబల్ వెల్ఫేర్ 8, జడ్‌పి 214 పాఠశాలల నుండి 22296 మంది విద్యార్థులకు గాను 21766 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9:30 నుంచి 12:45 నిమిషాల వరకు పరీక్షలను అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన 121 పరీక్ష కేంద్రాలలో ఎ కేటగిరి 58, బి కేటగిరి 55, సి కేటగిరి 16 సెంటర్లలో 121 మంది చీఫ్‌లు, 121 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్, 25 సెట్టింగ్ స్క్వాడ్, 1250 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహణ చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు.

పీలేరు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాయచోటి : బాలికల ఉన్నత పాఠశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎఎస్‌పి, విద్యాశాఖ అధికారులు

జిల్లా వ్యాప్తంగా మొదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణలో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా ఎఎస్‌పి వెంకటాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ఓపెన్ స్కూల్ జిల్లా కో- ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది, ఇతర అధికారుతో కలిసి రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ హై స్కూల్, నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, లక్కిరెడ్డిపల్లి మోడల్ స్కూల్ పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను అధికారులు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిర్వహిస్తున్న పోలీస్ బందో బస్తును సమీక్షించారు. నందలూరు మండలంలో పదవ తరగతి పరీక్షలు జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు పరిశీలించారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యలను శ్రద్ధతో బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా 300 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జి కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి సిటీ

గుంటూరులోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ 2025-26 అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు గుంటూరులోని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కేటగిరీలలో అగ్నివీర్‌ల యొక్క నియామకం కోసం రిజిస్ట్రేషన్‌ను www.joinindianarmy.nic.in ద్వారా చేయవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ ఏడాది ఏప్రిల్ 10గా నిర్ణయించారు. ప్రస్తుతం ఒక అభ్యర్థి అగ్నివీర్‌లో రెండు వేర్వేరు కేటగిరీలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సిఇఇ)ను మొదటి సారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషలలో నిర్వహించబడుతోంది. ఎన్‌సిసి ఎ, బి, సి సర్టిఫికేట్ హోల్డర్లు, అన్ని కేటగిరీలకు మెరిటోరియస్ క్రీడాకారులకు మరియు అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీకి ఐఐటి, డిప్లొమా అర్హత సాధించిన అభ్యర్థులకు బోనస్ మార్కులు కూడా ఇస్తారని పేర్కొన్నారు. గుంటూరు, కర్నూలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్ అసిస్టెంట్, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఆటోమేటెడ్ విధానంలో పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. అగ్నివీర్‌గా సైన్యంలో చేరేందుకు నిర్వహిస్తున్న రిక్రూట్‌మెంట్ కోసం ఎక్కడా ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదని అభ్యర్థులు గుర్తించుకోవాలని గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ కార్యాలయం వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఎదుట ఆరోగ్య మిత్రల ధర్నా

ప్రజాశక్తి- రాయచోటి

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయచోటిలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఎదుట సోమవారం జిల్లా వ్యాప్తంగా వైద్య మిత్రలు తరలివచ్చి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న వైద్య మిత్రలను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలో 17 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వైద్య మిత్రలకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్ గ్రేసియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరారు. సిఇఒకు తమ సమస్యలను పలుమార్లు విన్నవించినా పరిష్కరించలేదని తెలిపారు. ఫలితంగా శాంతియుత నిరసన తెలుపుతున్నామన్నారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్యాడర్ కల్పించాలని వారు ప్రభుత్వానికి విన్నవించారు.

రేపు మామిడి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న మామిడి సాగు చేసే రైతులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు ఎం.భాస్కర్, జి.సురేష్ బాబు పేర్కొన్నారు. మామిడిలో పూత పిందె దశలో సస్యరక్షణ, ఫ్రూట్ కవర్స్ వినియోగం, మార్కెటింగ్‌పై ఉద్యాన కళాశాల అనంతరాజుపేట ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉద్యాన పరిశోధన స్థానం, కళాశాల, అనంతరాజుపేట శాస్త్రవేత్తలచే రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాజంపేట డివిజన్‌లోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

రాయచోటి సబ్ జైల్‌లో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సోమవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జైలు పరిసరాలను రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమములో రాయచోటి సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

సబ్ జైల్లో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

'పది' పరీక్షలపై మొక్కవోని దీక్ష

- ద్విచక్ర వాహన ప్రమాదంలో కాలు విరిగినా పరీక్ష రాసిన విద్యార్థి

విద్యార్థిని పరీక్ష కేంద్రానికి మంచంపై కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట మండలం ఆకులవారిపల్లి లోహిత్ కుమార్‌రెడ్డి గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 10వ తరగతి చదువుతున్నాడు. శనివారం బైక్ ప్రమాదానికి గురై కాలికి తీవ్రగాయామైంది. కదల లేని పరిస్థితిలో ఉన్న పదో తరగతి విద్యార్థి లోహిత్ కుమార్‌రెడ్డికి సోమవారం స్థానిక మోడల్ స్కూల్లో 10వ తరగతి పరీక్ష రాయాల్చి ఉండడంతో పరీక్ష కేంద్రానికి హాజరయ్యాడు. పరీక్ష రాయలేకపోవడంతో స్కూల్లోని ఎగ్జామ్ చీఫ్ శ్రీరాములు మరో విద్యార్థినిని నియమించి కాలు విరిగిన విద్యార్థి చెబుతుండగా పరీక్ష రాయించారు. అతను పరీక్ష నొప్పిని బరిస్తూ పరీక్ష రాయాలని పట్టిదలతో పరీక్ష రాసి శభాష్ అనిపించుకున్నాడు. ఈ విషయంపై మండల విద్యా శాఖాధికారిని వివరణ కొరగా ఏ విద్యార్థికైతే నామినల్ రోల్‌లో ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ ఉంటుందో వారికి ప్రత్యేకంగా డిఇఒ స్క్రైబ్ ప్రొసీడింగ్స్ ఇవ్వవలసిన అవసరం లేదన్నారు. రాయబోయే విద్యార్థి యొక్క ఫొటోతో కూడిన స్క్రైబ్ అప్లికేషన్ స్టడీ సర్టిఫికేట్ తీసుకొని చీఫే అనుమతించవచ్చునన్నారు. ఈ కొద్దిరోజుల్లో ఎవరైనా ప్రమాదానికి గురై స్క్రైబ్ కావాలని అడిగేటట్లయితే వారికి మాత్రమే డీఈఓ పర్మిషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పరీక్షల మధ్యలో అకస్మాత్తుగా ఎవరికైనా ఇలాంటి పరిస్థితి వస్తే చీఫ్ అనుమతిచ్చేసి డిఇఒకు తెలిపితే సరిపోతుందని వెల్లడించారు.

గిరిజన మహిళపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

- సబ్ కలెక్టరేట్ ఎదుట ఆర్‌జిఎస్, బాస్ నేతల ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గిరిజన మహిళపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రాష్ట్ర గిరిజన సమాఖ్య, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌జిఎస్ వ్యవస్థాపకులు దివాకర్ మాట్లాడుతూ గుర్రంకొండ మండలం శీలంవారిపల్లికు చెందిన ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఎరుకల అలివేలమ్మ అనే మహిళపై నక్కల సుధాకర్, నక్కల బాలకృష్ణ నాలుగు రోజుల క్రితం పైశాచిక దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఒక మహిళను నడిరోడ్డులో బట్టలూడదీసి, లాక్కుంటూ జుట్టు పట్టుకుని లాగి ఊరంతా చూస్తుండగా వివస్త్రను చేసి కొట్టడం సిగ్గుచేటు కాదా అని మండిపడ్డారు. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నా ప్రభుత్వాలు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. గిరిజన మహిళకు వెంటనే ప్రభుత్వమే చికిత్స చేయించి, వారి కుటుంబానికి పోలీసుల రక్షణ కల్పించి, దాడి చేసిన సుధాకర్, బాలకృష్ణలను వెంటనే అరెస్టు చేసి సమాజంలో ఉన్న మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈమెపై జరిగిన దాడి ప్రభుత్వం ప్రజాస్వామ్యం సిగ్గుతో తల దించుకోవాలన్నారు. బాస్ జిల్లా నాయకులు ముత్యాల మోహన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గిరిజనులు, దళితులపైన అనేక దాడులు జరగడం వల్ల గిరిజనులు, దళితులు, బహుజనులు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. అయినప్పటికీ దాడులు కొనసాగడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ సంఘటన పైన హోం మంత్రి స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన, దళిత నాయకులు వసంతమ్మ, శివ ప్రసాద్, చిన్నప్ప, శ్రీనివాసులు, శివనాయక్, గీత, నందీష్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అభివృద్ధిపై దృష్టి సారించండి : 'దేశాయ్'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

పజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో జరిగే ప్రతి సంఘటనను వైసిపికి, ఆ పార్టీ నాయకులపై ఆపాదించడం సబబు కాదని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైకాపా నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే ప్రతి సంఘటనను వైసిపిపై మోపడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల నుండి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ తరహా పన్నాగాలు పన్నుతున్నారన్నారు. ఆర్నెళ్ల క్రితం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధంకాగా, రాష్ట్ర డిజిపిని, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీలను పిలిపించి నానా యాగి చేయడమే కాకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే ఈ ఘటనకు కారణమని ఆరోపణలు గుప్పించారన్నారు. చివరికి హైకోర్టు అది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని తేల్చి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వైసిపిపై విమర్శలు మాని సూపర్ సిక్స్ పథకాల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. మున్సిపల్ చైర్ పర్సన్ మనూజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైసిపిని, వైసిపి నాయకులను టార్గెట్ చేస్తుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్‌జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు రూపురేకలు మార్చారని, కూటమి ప్రభుత్వం మాత్రం అభివృద్ధి సంక్షేమాన్ని పక్కనపెట్టి, ప్రతి విషయాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై నెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా విమర్శలు మాని అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జన్నే రాజేంద్ర నాయుడు, సురేంద్రరెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, హర్షవర్ధన్ రెడ్డి, బీరంగి రేవతి, మేరీ, శ్యామల, నాగమణి, కోటూరి ఈశ్వర్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, 3వ వార్డు నూర్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ పద్మ

వైవీయూలో మొదలైన లా పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు, ఐదేళ్ల లా కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బి 3, 5వ సెమిస్టర్లు, ఐదేళ్లకు సంబంధించి 3, 5, 7, 9వ సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 572 మంది విద్యార్థులు హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షలను 173 మంది రాశారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని వివరించారు. పరీక్షల నిర్వహణలో అడిషనల్ సూపరింటిండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి పర్యవేక్షించగా, పరిశీలకులుగా డాక్టర్ సుభాష్ చంద్ర, డాక్టర్ హరినాథ్ వచ్చారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఆచార్య కాత్యాయని తెలిపారు.

రేపు వారపుసంత వేలంపాట

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బస్టాండ్ గేటు, వారపు సంత గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు ఈ నెల19వ తేదీ బుధవారం బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలోని వారపుసంత గేటు, బస్టాండ్ గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు ఉదయం 11 గంటలకు, వారపు సంత ఆవరణంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, సర్పంచ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు బస్టాండ్ గేటుకు రూ.70 వేలు, వారపు సంత గేటుకు రూ.2 లక్షలు, ఒక్కొక్క పంచాయతీ షాపింగ్ రూములకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు ముందుగా డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారానికి 7013954635 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంగం గౌరవ అధ్యక్షులు పి.సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. సమస్యలపై ఉప తహశీల్దార్ నవీన్‌కు వినతిపత్రం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి జెఆర్ ప్రకటన వెంటనే చేయాలని కోరారు. డిఎ బకాయిలు, పిఆర్ బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సిలో తగ్గించిన ఎలండ్‌పి పూర్వ పద్ధతిలో ఇవ్వాలని కోరారు. ఇహెచ్‌ఎస్ కార్డులపై పూర్తిస్థాయిలో ఆర్థిక వెసులుబాటు వైద్య మండలే చూసేలా చూడాలని కోరారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో విశ్రాంత ఉద్యోగులైన వై.ఆదినారాయణరెడ్డి, ప్రెసిడెంట్ వి.అబ్దుల్ ఖాదర్, మండల ప్రధాన కార్యదర్శి, స్టేట్ సెక్రటరీ కాంతమ్మ ఉన్నారు.

నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్షయ వ్యాధి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కుటుంబంలో ఎవరికైనా క్షయ వ్యాధి ఉంటే మిగిలిన కుటుంబ సభ్యులు తప్పనిసరిగా సివైటిబి స్కిన్ టెస్ట్ చేయించుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ శైలజ తెలిపారు. సివైటిబి స్కిన్ టెస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం కూచివారిపల్లె 1, 2వ వార్డులలోనూ, వరదయ్యగారిపల్లె కేంద్రాలలోనూ ఆరుగురు క్షయ వ్యాధిగ్రస్తులతో పాటు వారిని అనుసరించిన 8 మందికి సివైటిబి స్కిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ శైలజ మాట్లాడుతూ ఈ స్కిన్ టెస్ట్ ద్వారా టిబి వ్యాధి ఇన్ఫెక్షన్ ఉందో లేదో త్వరగా తెలుసుకోవచ్చునని తెలిపారు. ఒకవేళ స్కిన్ టెస్ట్ నందు పాజిటివ్ వస్తే మూడు నెలల పాటు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్షయవ్యాధి పర్యవేక్షకులు జయప్రకాష్, ఎఎన్ఎంలు నూర్జహాన్, కల్పన, ఎంఎల్‌హెచ్‌పి అలీషా, సుప్రియ, ఆశా కార్యకర్తలు సురేఖ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

యాత్రికులతో కిటకిటలాడిన మల్లయ్య కొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మల్లయ్య కొండకు దిగువనన్న వెలుగు మల్లమ్మ అమ్మవారిని పూజారి శేఖరు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు.పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఇఒ మునిరాజు, కొండకిట్టాలు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

వెలుగు సంస్థకు అందించిన సోఫాలు, టివి, టేబుల్

వెలుగు సంస్థకు సోఫాలు, టివి వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాగరాజు గుప్తా, సుందరమ్మ జ్ఞాపకార్థంగా కల్యాణ్ అమ్మచెరువు స్థానిక వెలుగు సంస్థకు రెండు సోఫాలు, టివి, టేబుల్‌ను వితరణగా అందజేశారు. సోమవారం వెల్ విషర్స్ సెక్రటరీ గిరీష్ వెలుగు సంస్థకు విచ్చేసి సదరు వస్తువులను దివ్యాంగులకు, వృద్ధుల ఉపయోగార్థం సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మోహన్‌రెడ్డి, వెల్ విషర్స్ గిరీష్ దాత కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, సోషల్ వర్కర్ ఎం.గీత, వార్డెన్ ఎం.స్వీటీ పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ కమిషనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీలేరు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వగళ్ల చంద్రారెడ్డి, ఎర్రమరాజు అన్నారు. సోమవారం పీలేరు తహశీల్దారు భీమేశ్వర రావు ద్వారా సోమవారం ముఖ్యమంత్రికి నివేదించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ. పిఆర్సి కమీషన్ ప్రకటించాలని, ఐ ఆర్ ప్రకటించాలని, గత పిఆర్సి, డి ఆర్ బకాయిలు మంజూరు చేయాలని, అడిషనల్ క్వాంటంను పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలకు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం వంతున పునరుద్ధరించాలని, పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పట్టని రైతుల గోడు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి పాలనలో పంటలకు ఏమాత్రం గిట్టుబాటు ధర లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల గోడు పట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతుకు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవ లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కందికి క్వింటాకు రూ7,550 కాగా, మార్కెట్‌లో దక్కేది రూ.6,500 మాత్రమే అన్నారు. శనిగకు రూ.5,650కుగానూ రూ.5200, మినుముకు రూ.7.400కు గాను రూ.6,000, పెసరకు రూ.8662కు రూ.7,000, జొన్నకు రూ.3371కు రూ.2200, మిరపకు రూ. 1,1781కి రూ.9,000మాత్రమే రైతుకు మార్కెట్‌లో దక్కుతున్నట్లు వివరించారు. పసుపునకు గత సంవత్సరం క్వింటాకు రూ. 15,000 లభించగా, ఈసారి రూ.7,000 మాత్రమే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అడ్రస్సే లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు ఖాతాకు ఈ సంవత్సరం బకాయిలతో కలిపి రూ.40,000 వేయాలని తులసిరెడ్డి కోరారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట : రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ద్వారా 2019-2024 మధ్యకాలంలో ఇల్లు మంజూరై అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ప్రభుత్వం సాయం అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్టీ వారికి రూ.75,000, ఎస్సీ వారికి రూ.50,000, బిసి వర్గాల వారికి రూ.50 వేల చొప్పున అదనపు సాయం మంజూరు చేస్తుందన్నారు. మండల వ్యాప్తంగా వివిధ దశల్లో 217 వరకు ఇళ్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 20 లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే వారికే ఈ అవకాశం కల్పించినట్లు ఎంపిడిఒ తెలిపారు. **మూద్దనూరు :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందిస్తుందని ఎంపిడిఒ ముకుందారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు కారణాల వల్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు ఆర్థిక సాయం కోసం గ్రామ సచివాలయం, హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపిడిఒ సూచించారు.

న్యాయం జరగలేదంటూ

యువకుడు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు
- ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన డిఎంహెచ్ఒపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బాధితుడు విశ్వనాథరెడ్డి

కడప కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - కడప

తమకు న్యాయం జరగలేదంటూ కలెక్టరేట్ లోని సభా భవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమాల్లో విశ్వనాథరెడ్డి అనే యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సభా భవన్‌లో జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారుల ఎదుట ఆ యువకుడు ఒంటిపై పెట్రోల్‌ను పోసుకున్నారు. గమనించిన అక్కడ ఉన్న పోలీసులు పెట్రోల్ బాటల్‌ను లాక్కుని అతన్ని రక్షించి బయటకు తీసుకెళ్లారు. సంఘటనకు సంబంధించి బాధితుడు విశ్వనాథరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. 2024 అక్టోబర్ 29న ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో తన భార్యకు ట్యూబెక్టమి ఆపరేషన్ చేయించానని చెప్పారు.ఆపరేషన్ సమయంలో డాక్టర్ ఇలియా రాణి తన భార్య పేగుకు రంధ్రం పెట్టి ప్రాణాపాయ స్థితికి కారణమైందన్నారు. లక్షలు డబ్బులు ఖర్చు పెట్టుకుని తన భార్యను బతికించుకున్నానని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరానని, మూడు నెలలుగా కలెక్టర్ కార్యాల యం చుట్టూ తిరుగుతూ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తున్నానని ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఒ నాగరాజును కోరానని, ఆయన ఆపరేషన్ చేసిన డాక్టర్ తప్పు ఏమీ లేదంటూ ఆమెను కాపాడే విధంగా రిపోర్టు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.. అనుభవం, నాలెడ్జి లేకపోవడం వల్ల ఇలా జరిగి ఉండ వచ్చునని డిఎంఅండ్‌హెచ్ఒ రిపోర్ట్ ఇచ్చి ఆపరేషన్ చేసిన డాక్టర్‌ను కాపా డాలని చూస్తున్నారని చెప్పారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణిని వెంటనే విధులలో నుండి తొలగించాలని కోరారు. ఆమె భర్త డాక్టర్ రవికుమార్ స్కాన్ సెంటర్ నడుపుతూ తప్పుడు రిపోర్టులు ఇచ్చి ప్రజల ప్రాణా లతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వీరిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తప్పుడు రిపోర్టు ఇచ్చిన డిఎంఅండ్‌హెచ్ఒ నాగరాజును విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం జరుగుతుందని స్పందన కార్యక్రమానికి వస్తే ఇక్కడ కూడా అన్యాయమే జరుగుతోందని బాధితుడు విశ్వనాథరెడ్డి వాపోయారు. వెంటనే డాక్టర్ ఇలియారాణిపైనా, తప్పుడు రిపోర్టు ఇచ్చిన డిఎంహెచ్ఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాయితీతో యంత్రాలు, పరికరాలు

రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.. ఈ నెలాఖరుకు అందనున్న యంత్రాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎస్ఎంఎఎం, ఎంఐడిహెచ్ పథకాల ద్వారా మొక్కల సంరక్షణ పరికరాలను ప్రభుత్వం రాయితీ ద్వారా ఆర్థికసాయం అందిస్తోంది. ఇందుకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ జరుగుతోంది. దరఖాస్తుదారుల పేరున వ్యవసాయ భూమి ఉండాలి. ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసుకునే వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తుదారుడు ట్రాక్టర్ యజమాని అయి ఉండాలి. వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగాన్ని ప్రోత్సహించడానికి రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ప్రదర్శనలతో చూపించనున్నారు. రైతులకు రాయితీ రుణాల ద్వారా పరికరాలు, యంత్రాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాలు అమలులో ఉన్నాయి. రాయితీలో 60 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం, 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఎర్రగుంట్ల మండల వ్యాప్తంగా రైతులు వీపునకు తగిలించుకొని స్ప్రే చేసే యంత్రాలు 17 మంజూరయ్యాయి. ఈ యంత్రం విలువ రూ.26,010. ఇందులో రాయితీ రూ.10వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. ట్రాక్టర్‌కు బిగించుకునే మందు పంపు ఒకటి మంజూరైంది. దీని విలువ రూ.41,100 కాగా, ఇందులో 50 శాతం రాయితీ వస్తుంది. ఏడు మడకలు (ఈనాడు గొర్రు) గొర్రు 12 మంజూరయ్యాయి. ఒక్కో దాని ధర రూ.42,840, ఇందులో రాయితీ 50శాతం వస్తుంది. 9 చక్కల బీటుగొర్రు ఏడు మంజూరయ్యాయి. దీని ధర రూ.39,270కాగా, 50శాతం రాయితీ వస్తుంది. ఆటోమేటిక్ విత్తనం గొర్రు (ఆరు చెక్కల విత్తనం గొర్రు) 8 మంజూరయ్యాయి. ఒక్కో దాని ధర రూ.58140. ఇందులో 50శాతం రాయితీ ఇస్తారు. రోటోవేటర్ (భూమి దున్నే యంత్రం) ఒకటి మంజూరైంది. ఇది ఐదు అడుగులది 36 బ్లేడ్లది. దీని ధర రూ.1,45,860. ఇందులో రాయితీ రూ.46,000 మాత్రమే వస్తుంది. మిగతాది రైతు భరించాలి. వీటిపై **ఎఒ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..** రైతులకు పరికరాలు, యంత్రాలు పొందేందుకు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెలాఖరుకు (మార్చి) అవి వస్తాయన్నారు. ఆసక్తిగల భూమి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రస్తా తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దర్గా వీధి 4-3-493 (15) డోర్ నెంబర్ ఇంటిలో ఉన్న ఓ వ్యక్తి రస్తాను ఆక్రమించుకొని కాంపౌండును ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఇంటి వెనకవైపు ఉన్న ఇళ్ల, ప్లాట్ల యజమానులు రస్తాలో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించి యథావిధిగా రాస్తాను కల్పించాలని సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు ఆరేళ్ల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈక్రమంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు అన్ని ధ్రువీకరణ పత్రాలతోపాటు వినతిపత్రం అందజేశారు. ఇందుకు కమిషనర్ ఒక్కసారిగా ఫిర్యాదు చేసిన వారిపై మండిపడ్డారు. ఆరేళ్ల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చే విషయంలో ఫిర్యాదుదారులు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇందుకు ఆయన సరిగా స్పందించకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ ఆక్రమణలు తొలగిస్తామని, రస్తాను యథావిధిగా కొనసాగిస్తామని కమిషనర్ రాముడు హామీ ఇచ్చారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఫిర్యాదుదారులు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడండి

స్టాల్ ప్రారంభించిన ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడాలని జమ్మలమడుగు మండల వ్యవసాయాధికారి చంద్ర శేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని క్యాడర్స్ పండించిన పంటల ఉత్పత్తులతో స్టాల్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో రసా యన పురుగు మందులు వాడ కుండా పంటలను పండి స్తు న్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమ వారం ప్రభుత్వ ఆసుపత్రిలో డిపిఎం ఆదేశాల మేరకు స్టాల్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహార పదార్థాలను పండించి, వాటిని స్టాల్ పెట్టి అమ్మడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కూరగాయలు, ఆకుకూరలను గూడెం చెరువు, పెద్ద దండ్లూరు, సిరిగేపల్లె, సున్నపు రాళ్లపల్లె, ఎస్.ఉప్పలపాడు గ్రామంలో పండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసిఆర్‌పిలు, ప్రజలు పాల్గన్నారు.

బిఇడి, ఎంఇడి పరీక్షలు షురూ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని 15 కేంద్రాల్లో బిఇడి, ఎంఇడి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బిఇడి పరీక్షలకు 4,463 మంది విద్యార్థులు, ఎంఇడి పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో, విజయలక్ష్మి బిఇడి కళాశాల పరీక్షా కేంద్రాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నిసా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విశ్వవిద్యాలయ అబ్జర్వర్లు పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి వెళ్లారన్నారు. ఈ పరీక్షలు ఈనెల 22 వరకు కొనసాగుతాయని తెలిపారు.

'సీమ'పై చిత్తశుద్ధిలేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాయలసీమపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీం ద్రనాథ్‌రెడ్డి అన్నారు. భవిష్య త్తులో రైతులు చొక్కా పట్టుకుని నిలదీసే రోజు వస్తుందన్నారు. చంద్రబాబు ఎప్పుడూ అధికారంలోకి వచ్చినా వర్షాలు పడవు, కరువు విలయతాండం ఆడుతుందని చెప్పారు. సోమవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. చంద్రబాబు గత పాలనలోనే తెలంగాణ అక్రమంగా ప్రాజెక్టులు కట్టింది అన్నారు. అప్పట్లో చంద్రబాబు ఓటుకు నోటు కేసు వల్ల ఒక్క మాట మాట్లాడలేదు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల్లోనే నీటిని వాడుకుంటుందని తెలిపారు. రాయలసీమ ప్రజలను తాకట్టు పెట్టిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. కర్ణాటకలో ప్రాజెక్టులు కడుతున్నా ఆ నాడు చంద్రబాబు పట్టించుకోలేదు అన్నారు. కేవలం 50 రోజుల్లోనే ఇప్పుడు రాయలసీమ రిజర్వాయర్లను నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే వైయస్సార్ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచారని తెలిపారు.వైయస్ జగన్ వచ్చిన తర్వాత సీమ ప్రయోజనాలను కాంక్షిస్తూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చేపట్టారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు బిహెచ్ ఇలియాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎపిపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - కడప : ఎపిపిఎస్‌సి ఫారెస్ట్ రేంజ్, జూనియర్ అసిస్టెంట్ ఇఎ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించి సోమవారం ఆరు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షలకు 279 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 279 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారులు పర్యవేక్షించారు. పరీక్షలకు ఆరుగురు మంది లైజన్ ఆఫీసర్లు, ఆరుగు చీఫ్ సూపరింటెండెంట్‌లు విధులు నిర్వర్తించారు.

అత్యాధునిక పిచ్ రోలర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలోని పోలీస్ క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతమున్న పిచ్‌ను క్రికెట్ టోర్నమెంట్‌లకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రోలర్‌ను తెప్పించారు. రోలర్‌కు ఎస్‌పి పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. వర్షానికి గ్రౌండ్ తడవకుండా ఉంచేందుకు వీలుగా ఏర్పాటు చేసిన వాటర్ ప్రూఫ్ గ్రౌండ్ షీట్‌ను ఎస్‌పి పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చుని, స్టేడియంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది కానివారైన ఇతరులు కూడా స్టేడియంను అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చని, వివరాలకు 9121100641, 9000144343లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (ఎఆర్) బి.రమణయ్య, ఆర్‌ఐలు టైటస్, ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి.!

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎండిహెచ్ షోరూం అధినేత నుంచి తమకు ప్రాణహాని ఉందని అమీన్,ఆసిఫ్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము రాయచోటి మోటార్ వెహికల్ షోరూమ్‌లో పనిచేస్తున్నామని తెలిపారు. తమపై అవినీతి ఆరోపణలు చేసి డాక్యుమెంట్లు, చెక్కులు తీసుకున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి తమతల్లి మరణించిందని ఆవేదన వ్యక్తప రిచారు. ఇప్పటికే చెక్ బౌన్స్ కేసు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. తాము ఇతరుల నుంచి రూ.30 లక్షలు అప్పు ఇప్పించామని, దానిని అడిగితే తమపై కేసులు పెడుతున్నారని తెలిపారు. అధికారుల న్యాయం చేయాలని కోరారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

న్యాయబద్ధమైన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని తహశీల్దార్ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం మాల మహానాడు మండల అధ్యక్షులు వీరనాల మాణిక్యం ఆధ్వర్యంలో సంఘం నాయకులు, కార్యకర్తలు తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగాగా ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సమాజంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తామన్నారు. ప్రతి నెల ఎస్సీ, ఎస్టీల నివాస ప్రాంతాలలో మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించి క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలను చూపుతామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, ఏదైనా ప్రభుత్వ భూముల్లో అన్యాక్రాంతం జరిగి ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉపాధ్యక్షులు శ్రీరాములు, గౌరవ అధ్యక్షులు ఎర్రయ్య, జయన్న, మనోహర్, భరత్, చంద్ర, వినయ్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ట్రాక్టర్ : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని ఎర్రగుడి గ్రామం చెంచర్లపల్లి మాదిగ పల్లి దగ్గర ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సోమవారం చెంచర్లపల్లి మాదిగ పల్లె నల్లకట్టవ దగ్గర ట్రాక్టర్‌తో మామిడి మొక్కలకు నీటిని తీసుకెళ్తూ ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాక్టర్ డ్రైవర్ వండాడి రాజశేఖర్ వయస్సు (31) మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు మృతుని భార్య ఆరు నెలల గర్భిణిగా ఉన్నదని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు కన్నీటి రోదనలు పర్యంతమయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎపిడి మధుబాబు

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ సమావేశం

ప్రజాశక్తి- చిట్వేలి

మండల కేంద్రంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా జరిగే సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అయితే జిల్లా కేంద్రం నుండి ఎపిడి మధుబాబు, క్లస్టర్ రాజంపేట పీడీ ప్రతాప్ ఇద్దరు అధికారులు హాజరయ్యారు. గతంలో మండలంలోని అన్ని పంచాయతీలు సంవత్సర కాలంలో జరిగిన పలు కార్యక్రమాలపై సమీక్ష సాయంత్రం ఏడు గంటల వరకు జరుగుతుండగా అందుకు భిన్నంగా మండలంలోని 21 పంచాయతీలు మధ్యాహ్నం ఒంటి గంటకే పూర్తిచేసి జాతీయ ఉపాధి కార్యాలయ సిబ్బంది భోజన ఏర్పాట్లు చేయగా ముగించారు. గతంలో ఈ సమావేశానికి పలు గ్రామాల నుండి పలు సమస్యలు వచ్చేవి ఇప్పుడు మాత్రం ఎలాంటి కూలీలు రాకపోగా ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం అక్కడ కూర్చునే సమయాన్ని పూర్తిస్థాయిలో కేటాయించకపోవడం ఆశ్చర్యం. స్థానికంగా ఉన్న మండల అభివృద్ధి అధికారి కలెక్టర్‌తో కాన్ఫరెన్స్ ఉండడంతో పూర్తిస్థాయిలో కార్యక్రమంలో పాల్గొనలేదు. ప్రజలకు సమాచారం ఇచ్చారో లేదో తెలియని పరిస్థితి. ఎట్టకేలకు తూతూ మంత్రంగా సమావేశాన్ని ముగించి అమ్మయ్య అని చేతులు దులుపుకున్నారు.

తోపుడు బండ్లకు గేట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తోపుడు బండ్లకు మార్కెట్ గేటును మార్చి నుంచి రద్దు చేయడం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తూ.. సోమవారం రాయల్ కూడలి వద్ద టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాణసంచాలు కాల్చి, థాంక్యూ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బురుగోళ్ల చిన్న, తుపాకుల రమణ, బండి అమర్నాథ్, శివ సారధి, రామిశెట్టి కిరణ్, బెల్లం బుజ్జి, తోపుడు బండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గానికి నవోదయ పాఠశాల మంజూరు ఏర్పాటుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేసిన కృషి ప్రశంసనీయం, అభినందనీయమని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, నియోజక వర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ సోమ వారం హర్షం వ్యక్తపరిచారు. విద్య, వైద్య పరంగా మైదుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే తీసుకున్న చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు.

పచ్చదనానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు ఆలయావరణలో పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య అవసరమని మహిళా ఎంట్రెప్రెన్యూర్ రమీజా, సుమ్మా పేర్కొన్నారు. స్థానిక అక్షర కళాశాలలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద నిలబడటానికి క్రమశిక్షణతో కూడిన విద్య చాలా అవసరమన్నారు. అమ్మాయిలకు ప్రత్యేకంగా కళాశాలను స్థాపించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. మహిళాలు ఆయా రంగాల్లో రాణిస్తున్నారనే దానికి నిదర్శనం అక్షర కళాశాల అన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ విజయభారతి మాట్లాడుతూ బాలికలు ఆయా రంగాల్లో రాణించేందుకు ఇంటర్మీడియట్ విద్యతోపాటు పోటీ పరీక్షలకు కూడా శిక్షణనిస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్‌లతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు భారం లేకుండా చేస్తున్నట్లు చెప్పారు. క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. పలువురి విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అక్షర అధ్యాపకులు విజయ్ కుమార్‌రెడ్డి, సుబహాన్, ప్రదీప్‌కుమార్, షాహీదా బేగం, ప్రమీల, అరిఫా, శివకేశరి పాల్గొన్నారు.